TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony, Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 236 | సోమవారం 16 డిసెంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper



## మహారాష్ట్ర కేబినెట్ విస్తరణ.. 39 మంది ప్రమాణం

**ముంబయి:** మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన పది రోజుల తర్వాత పూర్తిస్థాయిలో మంత్రివర్గ విస్తరణ జరిగింది. మహాయుతిలోని మూడు పార్టీలకు చెందిన పలువురు నేతలు మంత్రులుగా ప్రమాణం చేశారు. నాగ్‌పుర్‌లోని రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ వీరితో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉపముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌ల సమక్షంలో మూడు పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బావాన్‌కులేతోపాటు రాధాకృష్ణ విఖే పాటిల్, చంద్రకాంత్ పాటిల్, గిరీశ్ మహాజన్, గణేశ్ నాయక్, మంగళ్‌ప్రభాత్ లోధా, జయ్‌కుమార్ రావల్, పంకజ ముండే, అతుల్ సావే, అశోక్ ఉయికే, ఆశిశ్ శేలార్, శివేంద్రసిన్హ భోసలే, జయ్‌కుమార్ గోరె మంత్రులుగా ప్రమాణం చేశారు. శివసేన నుంచి గులాబ్‌రావ్ పాటిల్, దాదా భూసే, సంజయ్ రాథోడ్, ఉదయ్ సామంత్, శంభూరాజ్ దేశాయ్, ఎన్‌సీపీ నుంచి ధనంజయ్ ముండే, హసన్ ముష్రిఫ్, దత్తత్రేయ భార్నే, అధితీ తాత్కరే, మానిక్‌రావ్ కొకాటే, నరహరి జిర్వాల్ తదితరులు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. మహారాష్ట్రలో వరుసగా రెండోసారి 'మహాయుతి' ప్రభుత్వం డిసెంబర్ 5నే కొలువు దీరింది. భాజపా శాసనసభాపక్ష నాయకుడు దేవేంద్ర ఫడణవీస్(54).. రాష్ట్ర 20వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. శివసేన అధినేత ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అగ్రనేత అజిత్ పవార్‌లకు ఉప ముఖ్యమంత్రుల హోదా కల్పించారు. ఫడణవీస్ మహారాష్ట్ర సీఎంగా మూడోసారి బాధ్యతలు చేపట్టగా.. డిప్యూటీ సీఎంగా అజిత్ పవార్ ఆరోసారి బాధ్యతలు చేపట్టడం గమనార్హం. ఇదిలాఉంటే, మహారాష్ట్ర మంత్రివర్గంలో గరిష్ఠంగా 43 మంది మంత్రులు ఉండవచ్చు. వీటిలో 20 భాజపాకు, 13 శివసేన, 10ఎన్‌సీపీకి కేటాయించినట్లు సమాచారం.

**33 ఏళ్లలో తొలిసారి..** మంత్రుల ప్రమాణ స్వీకారానికి ఈసారి నాగ్‌పుర్‌లోని రాజ్‌భవన్ వేదికైంది. మహారాష్ట్ర శీతాకాల రాజధానిగా ఉన్న నాగ్‌పుర్‌లో 33 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ కార్యక్రమం నిర్వహించడం గమనార్హం. 1991లో సుధాకర్‌రావు నాయక్ ప్రభుత్వ హయాంలో కేబినెట్ విస్తరణ కార్యక్రమం ఇక్కడ జరిగింది. జూన్ 25, 1991 నుంచి ఫిబ్రవరి 22, 1993 వరకు మహారాష్ట్ర సీఎంగా నాయక్ కొనసాగారు.

## గుకేష్‌కు రజనీకాంత్ శుభాకాంక్షలు



**అన్నానగర్ న్యూస్:** ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్, చైనా డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లీ మధ్య సింగపూర్‌లో మ్యాచ్ జరిగింది. టోర్నీలో 14 రౌండ్లు ఉంటాయి. ఇందులో నిన్నగాక మొన్న 14వ రౌండ్ మరియు చివరి రౌండ్ జరిగింది. ఇందులో గుకేశ్ నల్లపావులతో ఆడాడు. దాదాపు 3 గంటలకు పైగా మ్యాచ్ జరిగింది. గుకేశ్ 58వ ఎత్తులో డింగ్ లిరెన్‌ను ఓడించి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. దీంతో గుకేశ్ 18 ఏళ్లకే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. దీంతో గుకేష్‌కు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. ఈ సందర్భంగా ప్రపంచ చెస్ ఛాంపియన్ కుగేషుకు నటుడు రజనీకాంత్ ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ను ఆహ్వానించిన పీవీ సింధు



**హైదరాబాద్:** తన వివాహానికి రావాల్సిందిగా ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆహ్వానించింది. ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబుకు, మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎంను తండ్రి రమణతో కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసింది. ఈ నెల 22న వెంకట దత్త సాయిని సింధు పెళ్లి చేసుకోబోతున్న సంగతి తెలిసిందే. మరోవైపు అత్యంత సన్నిహితుల సమక్షంలో కాబోయే ఈ దంపతులు నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే.

## జాకీర్ హుస్సేన్ కన్నుమూత



ప్రఖ్యాత తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ (73) కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆసుపత్రిలో చేరిన ఆయన.. తుదిశ్వాస విడిచినట్లు సన్నిహితులు వెల్లడించారు. కొన్ని రోజులుగా హృదయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని తెలిపారు.

## నంద్యాల జిల్లాలో డబ్లింగ్ పనులు

**నంద్యాల:** పాణ్యం, బుగ్గనపల్లె, కృష్ణమ్మ కోన రైల్వేలైన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనుల కారణంగా ఈనెల 16 నుంచి 27 వరకు పలు రైళ్లను రద్దు చేయగా.. మరికొన్నింటిని దారి మళ్లించినట్టు గుంతకల్లు రైల్వే డీఆర్ఎం విజయకుమార్ తెలిపారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఏఐటిఎఫ్ ఘన నివాళి





**విల్లివాకం న్యూస్:** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని చెన్నై మైలాపూర్‌లో గల పొట్టి శ్రీరాములు స్మారక భవనంలోని ఆయన విగ్రహానికి అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటిఎఫ్) ఆధ్వర్యంలో కార్యవర్గం ఆదివారం ఉదయం ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఎప్పటిలా నాలుగు కోర్కెలు కోరుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ స్వంత భవనానికి నిర్వహణ, ఖర్చులకు సరిగా నిధులు అందడం లేదని సక్రమంగా ఇవ్వాలని కోరారు. అలాగే ప్రవాసాంధ్రుల బాగోగులు చూసేందుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. అంతేకాకుండా తమిళనాడులో ప్రభుత్వం తమిళ విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందజేస్తున్న విధంగా తెలుగు విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున అవార్డులను అందజేయాలని కోరారు. తెలుగు వారు పొట్టి శ్రీరాములును మరచిపోకూడదని, ఇక్కడ అందరూ కలిసి నివాళులు అర్పించాలని, ఆయనను తరచుగా గుర్తు చేసుకోవాలని కోరారు. ఇందులో ప్రధాన కార్యదర్శి నందగోపాల్, టామ్స్ ఇశ్రాయేలు, పాల్ కొండయ్య, ఊరా శశికళ తదితరులు పాల్గొన్నారు. అలాగే, జరిగిన సమావేశంలో తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్మెంట్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, జే మేఘనాధ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, వి. కృష్ణారావు, గుడిమెట్ల చెన్నయ్య, జెయం నాయుడు, శివకుమారి తదితర తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.



## ఆయుధాలు వీడి రండి..

**జగ్దల్‌పుర్:** నక్సలైట్లు ఆయుధాలు వీడి.. లొంగిపోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పుర్‌లో జరిగిన 'బస్తర్ ఒలింపిక్స్' ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "లొంగి పోవాలనుకొనే నక్సలైట్లను మేం స్వాగతిస్తున్నాం. ఆయుధాలు వీడండి. లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరండి. మీ పునరావాసం బాధ్యత మాది. ఈ విజ్ఞప్తిని తిరస్కరిస్తే.. భద్రతా బలగాలతో కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. బస్తర్‌లో నక్సలిజం అంతమైతే.. ఇక్కడి ప్రకృతి అందాలను వీక్షించేందుకు కశ్మీర్ కన్నా ఎక్కువ మంది పర్యాటకులు వస్తారు. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మారుస్తాం" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. 2026 మార్చి 31 నాటికి భారతదేశాన్ని నక్సల్ రహితంగా మార్చాలన్న ప్రధాని మోదీ సంకల్పాన్ని నెరవేర్చేందుకు ఛత్తీస్‌గఢ్ పోలీసులు కట్టుబడి ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలో ఉన్న సమయంలో తీవ్రవాద శక్తులపై చర్యలు అంత వేగంగా ఉండేవి కాదని విమర్శించారు. ఇక్కడ భాజపా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే చర్యల్ని వేగవంతం చేశామన్నారు. ఏడాదిలో 287మందిని భద్రతా బలగాలు అంతం చేయగా.. 992మందిని అరెస్టు చేశామని.. 836మంది లొంగిపోయారని వివరించారు.



# త్యాగమూర్తి అమరజీవి పొట్టి శ్రీరాములు

**విల్లివాకం న్యూస్:** సమాజం కోసం జీవితాన్ని అర్పించిన త్యాగమూర్తి అమరజీవి పొట్టి శ్రీరాములని తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్మెంట్ అథారిటీ, మెంబర్ సెక్రటరీ జె. మేఘనాధ రెడ్డి తెలిపారు. చెన్నై, మైలాపూర్ లోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా 'ఆత్మార్పణ దినం' కార్యక్రమం ఆదివారం ఉదయం జరిగింది. ముందుగా నిడమర్తి వసుంధరా దేవి ప్రార్ధన గీతాన్ని ఆలపించారు. చైర్మన్ కె. అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగఫలం ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని, ఉద్యమాలకు ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా జె. మేఘనాధ రెడ్డి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా భాష ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని, సమాజం కోసం ఒక వ్యక్తి ఎన్ని విధాలుగా పోరాడవచ్చునేది ఆయన ద్వారా నేర్చుకోవాల్సిన విషయం అన్నారు. విశిష్ట అతిథిగా ప్రపంచ తెలుగు సమాఖ్య, ప్రధాన కార్యదర్శి, కె శ్రీలక్ష్మి మోహనరావు





పాల్గొన్నారు. సంయుక్త కార్యదర్శి ఊరా శశికళ స్వాగతోపన్యాసం చేసి సభా నిర్వహణ చేపట్టారు. చివరిగా సభ్యురాలు డాక్టర్ ఏవి శివకుమారి వందన సమర్పణ చేశారు. ఇందులో సభ్యులు గుడిమెట్ల చెన్నయ్య, జెఎం నాయుడు పాల్గొన్నారు.

వి. కృష్ణారావు రచించగా, ఎన్ గోపాలయ్య దర్శకత్వం వహించిన 'స్వాతంత్ర్య సమరయోధులు మళ్లీ పుడితే' నాటిక ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. దీనిని టి.నగర్ కేసరి పాఠశాల విద్యార్థులు ప్రదర్శించారు. వి.కృష్ణారావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనిల్ కుమార్ రెడ్డి విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీటీడీ మాజీ అధ్యక్షు లు ఆనంద్ కుమార్ రెడ్డి, టాప్స్ అధ్యక్షులు గొల్లపల్లి ఇశ్రాయేలు, ఊరా ఆంజనేయులు, కట్టబ్రహ్మన్న, ఎల్బీ శంకరరావు దంపతులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



# అదానీపై ఆరోపణలు గురించి చర్చించాలి

**విల్లివాకం న్యూస్:** అదానీపై ఆరోపణలు గురించి పార్లమెంటులో చర్చించాలని ముఖ్య మంత్రి స్టాలిన్ అన్నారు.అమెరికా కోర్టులో అదానీ అవినీతి ఫిర్యాదు కేసులో తమిళనాడు పవర్ ఇండస్ట్రీ పేరు కూడా ప్రస్తావనకు వస్తోందని సభ్యుడు జీకే మణి ప్రశ్నించారు. దానికి ముఖ్యమంత్రి స్పందిస్తూ.. జీకే మణి మాత్రమే కాకుండా పార్టీ అధినేత కూడా బహిరంగంగా మాట్లాడుతున్నారని, ఇక్కడ మాట్లాడతారని అనుకున్నానని, అయితే అసలు విషయం తెలిసి వదిలేశానని అన్నారు. అదానీపై ఆరోపణలు గురించి పార్లమెంటులో చర్చించాలి. కూటమి ఎంపీలు గళం విప్పారు. అలాగే తమిళనాడులో



అదానీ కంపెనీ పెట్టుబడులను రాజకీయం చేస్తున్నారని, తనను కలవడానికి అదానీ రాలేదని, నేను ఆయన్ను చూడలేదని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అసెంబ్లీలో స్పష్టంగా చెప్పారు.



వేలూరు విరించిపురం అరుల్మీకు మరగతాంబికై సమేత స్వయంబు అరుల్మీకు మార్గపంతీశ్వర ఆలయంలో ఆదివారం జరిగిన కార్తీక మాస ఆఖరి ఆదివారం ఉత్సవాల్లో గుడియాత్తం ప్రాంతానికి చెందిన ఎస్‌జిఎం బియ్యం మండి యజమాని జగన్ కుటుంబీకులు 2 రోజుల పాటు భక్తులకు అన్నదానం చేశారు. **-వేలూరు**



వేలూరు కోట మైదానంలోని శ్రీ నాగదేవతమ్మ ఆలయంలో కార్తీకమాస ఆఖరి ఆదివారం పౌర్ణమి దినోత్సవం పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు పుష్పాలకర్రలు నిర్వహించి దీపారాధన పూజలు చేశారు అనంతరం లోక క్షేమం కోసం యాగ పూజలు చేసి మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు ఏర్పాట్లను ఆలయ పూజారి వేలాయుదపాణి నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మవారు అర్ధనారీశ్వరుడు అలంకరణలో దర్శన మిచ్చారు (వేలూరు)

## కవి సోమన్నకు మంత్రాలయంలో సన్మానం



పెద్దకడబూరు మండల పరిధిలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 142వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో ఆ సంస్థ అధినేత డా.కత్తిమండు ప్రతాప్,విచ్చేసిన శ్రీశ్రీ కళావేదిక కార్యవర్గం, కవులు, కళాకారులు, ప్రముఖులు పరిమళ విద్యా నికేతన్ పాఠశాల, మంత్రాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వీరు రచించిన "అనుబంధాలు" పుస్తకాన్ని కవులు, పాఠకులు, పాత్రికేయ మిత్రుల సమక్షంలో పరిచయం చేయడం జరిగింది. అనతి కాల వ్యవధిలో 60పుస్తకాలు వ్రాసి ముద్రించిన శ్రీ గద్వాల సోమన్న గారి విశేష కృషిని ప్రశంసించి, సత్కరించటం విశేషం. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు శ్రీమతి మళేకర్ నాగజ్యోతి,డా.బల్లూరి ఉమాదేవి, శ్రీమతి సువర్ణ జోషి, శ్రీమతిశోభామణి, శ్రీమతి జి.ఈశ్వరి,శ్రీ డి. కేశవయ్య,ఆరెకటికె నాగేశ్వరరావు, పద్య కవి శ్రీ ఈశ్వరప్ప, సామాజిక కార్యకర్త శ్రీ నీలకంఠ, పి.వీరాచారి మరియు పాత్రికేయ మిత్రులు మున్నగువారు పాల్గొన్నారు.



## సెంగుడ్రం పులల్ జైన్ విద్యాశ్రమలో విద్యార్థుల కోసం ప్రేరణ కార్యక్రమం

**చెన్నై న్యూస్ :** రాజలక్ష్మి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజ్ మరియు చెన్నై సోషల్ లయన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంగుడ్రం పులల్ జైన్ విద్యాశ్రమ పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ కుమార్ తాటియా నేతృత్వంలో విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రేరణ కార్యక్రమం నిర్వహించబడింది. పాఠశాల సెక్రటరీ సంపత్ కుమార్ బాగ్మార్, పాఠశాల ప్రిన్సిపాల్ టి. జయంతి కార్యక్రమానికి హాజరైన వారికి స్వాగతం పలికారు. అరుంబాక్కం లయన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు (స్టూడెంట్ మోటివేషన్) రమేష్ కుమార్, రాజలక్ష్మి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రతినిధులు వివేక్, మహేంద్రన్, చెన్నై సోషల్ లయన్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ఫ్రెండ్ ఎం. మహమ్మద్ అబూబకర్ ఈ కార్యక్రమానికి సారథ్యం వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యార్థుల చైతన్యకర్త రాజేష్ ఫెర్నాండో, విద్య ద్వారా జీవితాలను మెరుగుపరుచుకునేందుకు నిరంతరం కృషి



చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎన్‌టిపిసిలో వైభవంగా గురు దత్తాత్రేయ స్వామి జయంతి

**జ్యోతి నగర్ :** ఎన్‌టిపిసి, పిటిఎస్ వైకుంఠపురంలోని హరి హర దేవాలయంలో ఆదివారం గురుదత్తాత్రేయ స్వామి జయంతి పౌర్ణమి బ్రహ్మశ్రీ వామన శర్మ గారి ఆధ్వర్యంలో అతి వైభవంగా జరిగింది అని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ స్వామి వారికి అతి వైభవంగా పంచామృతాలతో, పళ్ళ రాసాలతో అభిషేకం జరిపి ప్రత్యేక పూజలు చేశారు అని అన్నారు. ఈరోజు దత్త పౌర్ణమి కాబట్టి మార్గశిర శుద్ధ పంచమి మొదలుకొని పౌర్ణమి వరకు సప్తాహం ఏడు రోజులు ఉదయము సాయంకాలము దత్తునికి అభిషేకాలు పూజలు జరుపుకున్న భక్తులందరికీ ఉన్నటువంటి కోర్కెలు తీరుతాయి అని ముఖ్యంగా సంతానలేమి వారు, వివాహం సమస్యలు ఉన్నవారు నియమనిష్టలతో పూజ చేసిన యడల కార్యసిద్ధి కలుగును అని బ్రహ్మశ్రీ రాంపల్లి వామన శర్మ గారు అన్నారు. గురు దత్తాత్రేయ స్వామి ఒక మేడి చెట్టు కింద తొర్రలో




కూర్చొని తపస్సు చేసి ఈపౌర్ణమి నాడు గుహలో ఉద్భవించిన రోజు కాబట్టి ఈరోజున దత్త జయంతి అని ప్రత్యేక పూజలు చేస్తారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి, నాయకులు బండారి కనకయ్య, అయ్యప్ప స్వాములు వేణు గోపాల్ గౌడ్, రాము స్వామి , భరత్ స్వామి, రమా కాంత్ స్వామి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సోపాన్ 4వ ఎడిషన్ కార్యక్రమం

**విల్లివాకం న్యూస్:** అలెన్ కెరీర్ ఇన్స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆదివారం చెన్నైలోని అన్నా సెంటెనరీ లైబ్రరీ సోపాన్ యొక్క 4వ ఎడిషన్‌ను జరుపుకుంది. సోపాన్ చెన్నై నుండి వివిధ ఒలింపియాడ్స్, ఐఐటి, జేఈఈ మరియు నీట్ (యుజి)లో అర్హత సాధించిన విద్యార్థులను సత్కరించే అలెన్ వార్షిక వేడుక. అలెన్ రెండు సెషన్లలో సోపాన్ నిర్వహించింది. ఉదయం సెషన్ 9.30 నుండి 12.30 వరకు జరిగింది. సాయంత్రం సెషన్ 3.00 నుండి 6.30 వరకు జరిగింది. ఈ సంవత్సరం 6,500 మంది విద్యార్థులు తల్లిదండ్రులు అలెన్ సోపాన్ లో పాల్గొన్నారు. మార్నింగ్ సెషన్‌కు ముఖ్య అతిథిగా కె శంకర్, కమిషనర్ ఆఫ్ పోలీస్ అవడి చెన్నై పాల్గొని ఐఐటిఎస్ ఎన్ఐటిఎస్, ఐఐటిలు, ఒలింపియాడ్ లలో గెలుపొందిన విద్యార్థులను సత్కరిం చారు. చెన్నైలోని ప్రతిభను ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోకి అడుగుపెట్టడం నాకు ఎంతో




ఆనందాన్ని ఇస్తోందని, ఈరోజు వేడుకల్లో భాగమైనందుకు గర్విస్తున్నాను అన్నారు. ఈవెనింగ్ సెషన్ కు మోహన్ డయాబెటిక్స్ స్పెషాలిటీస్ సెంటర్, మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ వి మోహన్ ముఖ్య అతిథిగా అధ్యక్షత వహించారు. ఆయన మద్రాసు మెడికల్ కాలేజీ 1971 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి, మద్రాస్ మెడికల్ కాలేజీ చరిత్రలో అత్యుత్తమ బ్యాచ్‌గా ఎంపికయ్యారు.

## ఘనంగా 'చెన్నపురిలో తెలుగు తేజం' పుస్తకావిష్కరణ




**విల్లివాకం న్యూస్:** 'చెన్నపురిలో తెలుగు తేజం - అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం' గ్రంథావిష్కరణ శనివారం రాత్రి ఘనంగా జరిగింది. దీనికి చెన్నై మైలాపూర్, లజ్ లోని ఆంధ్ర మహిళా సభ వేదికగా నిలిచింది. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి ఆధ్వర్యంలో ప్రతీ నెలా నిర్వహించే నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా అమరజీవి వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సభాధ్యక్షులుగా పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షులు డాక్టర్ (అజంతా) కే.శంకర రావు వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు కారణజన్ముడని అన్నారు. ఆయన తెలుగువారందరికీ చిరస్మరణీయులని అన్నారు. అమరజీవిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమరజీవి స్మారక భవనం అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదుకొని అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వం ఆదుకోక పోతే చెన్నైలోని ఆర్య వైశ్యులంతా కలసి తెలుగు వారు గర్వపడేలా అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజధాని కళాశాల- చెన్నై విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎల్.బి.శంకరరావు పాల్గొని రచయిత్రి సరోజినీ ప్రేమ్ చంద్ రూపొందించిన చెన్నపురిలో తెలుగు తేజం పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. తొలి ప్రతిని శ్రీ రాజాలక్ష్మీ ఫౌండేషన్ పి. పూర్ణిమ స్వీకరించారు. ఆచార్య ఎల్ బి శంకర రావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు




అసలు సిసలైన గాంధేయవాది అన్నారు. నిస్వార్థ దేశభక్తుడు, నిరాడంబరుడు, త్యాగశీలి, కార్యదీక్షాపరుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా డి.జి. వైష్ణవ కళాశాల విశ్రాంతాచార్యులు, కవి, విమర్శకులు డాక్టర్ కాసల నాగభూషణం పొట్టిశ్రీరాములు, వై ఎస్ శాస్త్రి, వై రామకృష్ణలు చిరస్మరణీయులు అన్నారు. అలాగే పద్యాలతో ఆకట్టుకున్నారు. విశిష్ట అతిథిగా ప్రముఖ రచయిత్రి జలంధర చంద్రమోహన్ పాల్గొని అమరజీవి త్యాగాలను కొనియాడారు. పుస్తక సమీక్షను జనని సంస్థ, ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య చేశారు. స్పందనను ప్రముఖ రచయిత్రి సరోజినీ ప్రేమచంద్ తెలియజేశారు. సభా నిర్వహణ డి.ఆర్.బి.సి.సి.సి. హిందూ కళాశాల తెలుగు సహాయాచార్యులు డాక్టర్ కల్పనా గుప్తా చేపట్టారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అజంతా కె.శంకర రావుతో పాటు అతిథులు కలసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయశ్రీ, జి. బాలాజీ, జి.మాధురి, వసుంధర, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

## సుడిగాలి పర్యటనలు : ఈపిఎస్



**గిండి న్యూస్:** ఎ.డి.ఎం.కె. మహాసభలో ప్రధాన కార్య దర్శి ఎడప్పాడి పళనిస్వామి, డీఎంకే కూటమి పార్టీలకు ప్రజల సమస్యలపై అవగాహన లేదు. అవినీతి కారణంగా డీఎంకే పాలన రద్దయింది. అన్నాడీఎంకే ఆవిర్భావం విజయానికి ఆధారం. 200 సీట్లలో డీఎంకే కూటమి విజయం కల, నిజం కాదు. పత్రికల్లో హత్యాకాండలా కనిపించేంత స్థాయిలో శాంతి భద్రతలు క్షీణించాయి. ఏఐఏడీఎంకే ఎక్కువ మంది యువతను రిక్రూట్ చేసుకోవాలి.జనవరి నెలాఖరులోగా తమిళనాడులోని మొత్తం 234 నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేస్తానని చెప్పారు.

## జనవరిలో పరీక్షలు

**గిండి న్యూస్:** భారీ వర్షాలకు నష్టపోయి అర్ధవార్షిక పరీక్షను నిర్వహించలేని పాఠశాలలకు జనవరి మొదటి వారంలో పరీక్ష నిర్వహించేందుకు యోచిస్తున్నట్లు మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. ఫెంజల్ తుపాను కారణంగా విల్లుపురం, కడలూరు, కళ్లకురిచ్చి, వెల్లూరు, సేలం, కృష్ణగిరి జిల్లాలు చాలా నష్టపోయాయి. ఆయా జిల్లాల్లోని పాఠశాలల్లో అర్ధవార్షిక పరీక్ష నిర్వహిస్తారా? అనే ప్రశ్న తలెత్తింది. ఈ విషయమై చెన్నైలోని కోట్టూరు పురంలో మీడియాతో సమావేశమైన పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేస్ మాట్లాడుతూ.. వర్షాభావ పాఠశాలల్లో అర్ధవార్షిక పరీక్ష, ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించలేని పరిస్థితి ఉంటే.. జనవరి మొదటి వారంలో నిర్వహించి, మిగిలిన పాఠశాలల్లో అనుకున్న ప్రకారం 9తేదీ నుంచి అర్ధవార్షిక పరీక్ష నిర్వహిస్తారు.

## అన్నాడీఎంకేలో విభేదాలు ఎక్కడున్నాయి? : సివి షణ్ముగం

**అన్నానగర్ న్యూస్:** ఎ.డి.ఎం.కె. సాధారణ కమిటీలో మాజీ మంత్రి సీవీ షణ్ముగం మాట్లాడారు. అప్పుడు ఆయన మాట్లాడుతూ... విప్లవ నాయకురాలు అమ్మ మరణానంతరం ఈ ఉద్యమం, అమ్మ ప్రభుత్వం ఉంటుందా? లేదా?.. అనే సమయంలో, ఆ క్లిష్ట పరిస్థితిలో, కష్టకాలంలో ఈ ఉద్యమాన్ని నడిపించిన దాతృత్వమని వాలంటీర్లు అంగీకరించి, అమ్మ పాలనలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 4 సంవత్సరాలు అద్భుతమైన పాలన అందించింది ఎడప్పాడియార్ ప్రభుత్వం.ఆ తర్వాత శత్రువులే కాదు ద్రోహుల వల్ల కూడా రకరకాల పరీక్షల వల్ల ఉద్యమం చీలిపోయింది. చిహ్నం నిలిపివేయబడింది. రకరకాల పరీక్షలు ఎదుర్కొన్నప్పటికీ, ఏడీఎంకే దెబ్బతినకుండా బలమైన కోటగా నిలిచింది. ఈ రోజు ఈ సంస్థ ఉనికికి పూర్తి కారణం మా వ్యక్తిత్వ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి.



ఒకటి బాగా అర్థం చేసుకోండి. మమ్మల్ని ఓడించే వారు ఎవరూ లేరు. విశ్వాసమే మన విజయానికి మొదటి మెట్టు. ఆ నమ్మకానికి భంగం కలిగించేలా నేడు పరోక్షంగా, ప్రత్యక్షంగా మనపై దాడులు చేస్తు న్నారు. ఏఐఏడీఎంకే అనేది 2 కోట్ల మంది వాలంటీర్లపై ఆధారపడిన ఉద్యమం.ఈ ఎడప్పాడియార్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైనప్పుడు ఏ కోలాహలం ఉందో అదే కోలాహలం నేటికీ ఉంది.ఈ మందిరాన్ని నింపుతున్న ఈ స్వచ్ఛంద సేవకులను చూడండి. ఇక్కడ అసమ్మతి ఎక్కడ ఉంది? ఎక్కడ గొడవ? మీరు సందడి చేయడం లేదా? అభిప్రాయ భేదాలు వస్తాయా? అని ఆలోచించే వారు ఇక్కడ చూడండి. 2026లో ఎడప్పాడియార్ నాయకత్వంలో ఇది మా అమ్మ పాలన నడుస్తుందని పేర్కొన్నారు.



## మోసం చేసే పాలకుడిని చీటర్ అంటారా?.. విజనరీ అంటారా?



**తాడేపల్లి: ఎన్నికల్లో తానిచ్చిన మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ సహా ఇతర హామీలకు తూట్లు పొడుస్తూ మోసాలు, అబద్ధాలతో ప్రజలకు నమ్మక ద్రోహం చేస్తున్న చంద్రబాబు ఇప్పుడు మళ్లీ విజన్-2047 పేరిట డాక్యుమెంట్ విడుదల చేయడం మరో డ్రామా, స్టంట్ కాదా? అని వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ప్రజలకు తాను చేసిన వాగ్దానాలను గంగలో కలిపిన పాలకుడ్ని చీటర్ అంటారు కాని, విజనరీ అంటారా? అని నిలదీశారు. విజన్ల పేరుతో చంద్రబాబు చేస్తున్న మోసాలను వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా ఎండగట్టారు.**

విజన్-2047 పేరిట చంద్రబాబు మరో మారు పబ్లిసిటీ స్టంట్‌కు దిగారు. ప్రజలను మభ్యపెట్టడానికి, మాయచేడానికి ఇదొక ఎత్తుగడ మాత్రమే. చంద్రబాబు పత్రంలో రాష్ట్రం అవసరాలకు, ప్రజల అవసరాలకు చోటేలేదు, వాస్తవిక దృక్పథం అంతకన్నా లేదు. ఆయన పాలన ఎప్పుడూ ప్రజలు తనకిచ్చిన ఐదేళ్ల కాలంలో తన మేనిఫెస్టోలో చెప్పినవాటి అమలు మీద ఎప్పుడూ ఉండదు. ఎప్పుడూ ప్రజలను మోసం చేయడంమీదనే, ప్రజలను మాయ చేయడం మీదనే తన ధ్యాసంతా ఉంటుంది.

1998లో కూడా చంద్రబాబు విజన్-2020 పేరిట డాక్యుమెంట్ విడుదల చేశారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో అదొక చీకటి అధ్యాయం. రైతుల ఆత్మహత్యలు, పనులకోసం వలసలు, ఉపాధిలేక, ఉద్యోగాల్లేక అష్టకష్టాలు, వీటన్నింటినీ దాచేసి చంద్రబాబుగారు తన విజన్ చుట్టూ నడిపించిన ప్రచారం అంతా ఇంతా కాదు.

ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ విలువైన ఆస్తులను పప్పుబెల్లాల మాదిరిగా తన మనుషులకు కట్టబెట్టి అవినీతికి పాల్పడ్డారు. ఆ రోజుల్లో స్విట్జర్లాండ్‌కు చెందిన అప్పటి ఆర్థిక మంత్రి పాస్కల్ హైదరాబాద్ వచ్చిన సందర్భంలో విజన్ డాక్యుమెంట్లు పేరిట ఇలా అబద్ధాలు చెప్పేవారిని మా దేశంలో అయితే జైలుకో లేకపోతే ఆస్పత్రికో పంపిస్తామని కామెంట్ చేశారు. చివరకు ప్రజలు కూడా విజన్-2020 కాదు, "420" అంటూ చంద్రబాబును దుయ్యపట్టారు. 2014లోకూడా చంద్రబాబుగారు విజన్-2029 డాక్యుమెంట్ ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయింది.

తన పరిపాలనలో మొత్తం 3 విజన్లు ప్రకటించిన చంద్రబాబు చిరస్థాయిగా నిలిచిపోయే పని ఒక్కటైనా చేశాడా? ప్రభుత్వానికి మేలు జరిగే విధంగా ఒక్క ప్రాజెక్టు అయినా కట్టాడా? ఒక్క పోర్టుకాని, ఫిషింగ్ హార్బర్లు కట్టాడా? ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టాడా? స్కూళ్లు బాగుచేశాడా? ఆస్పత్రులు బాగు చేశాడా? వ్యవసాయరంగాన్ని బాగుచేశాడా? చెప్పుకోదగ్గ ఉద్యోగాలు ఇచ్చాడా? మానవవనరుల అభివృద్ధి మీద, వారి భవిష్యత్తుమీద ఒక్కపైసా అయినా ఖర్చుచేశాడా? ఒక్కటంటే ఒక్కటి కూడా చేయలేదు.

ఎన్నికల్లో తానిచ్చిన మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ సహా ఇతర హామీలకు తూట్లు పొడుస్తూ మోసాలు, అబద్ధాలతో ప్రజలకు నమ్మక ద్రోహం చేస్తున్న చంద్రబాబు ఇప్పుడు మళ్లీ విజన్-2047 పేరిట డాక్యుమెంట్ విడుదల చేయడం మరో డ్రామా, స్టంట్ కాదా? ప్రజలకు తాను చేసిన వాగ్దానాలను గంగలో కలిపిన పాలకుడ్ని చీటర్ అంటారు కాని, విజనరీ అంటారా?

చంద్రబాబు పాలనలో, ఆయన గత 14 ఏళ్లకాలంలో కూడా ఎప్పుడూ రెవెన్యూ లోటే కనిపిస్తుందన్నమాట వాస్తవం కాదా? మరి ఇంకెక్కడి సంపద సృష్టి. ఆయన పాలించిన ఏ ఒక్క సంవత్సరంలోనైనా రెవెన్యూ మిగులు ఉందా? ఆయనకు సంపద సృష్టించే శక్తి లేదు, సమగ్రమైన ఆర్థిక నియంత్రణ కూడా లేదు. ఇప్పుడు విజన్-2047 ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లు చేస్తానంటూ చంద్రబాబు చెప్పడం కూడా కట్టుకథ కాదా? సహజంగా ఏ రాష్ట్రంలోనైనా కాలం గడుస్తున్న కొద్దీ ఆర్థిక వ్యవస్థ పెరుగుతూ వస్తుంది. ఇప్పటినుంచి వచ్చే 10ఏళ్లు తీసుకున్నా లేక గతంలో 10 ఏళ్ల లెక్కలు తీసుకున్నా ఏ రాష్ట్రమైనా, ఏ దేశమైనా ద్రవ్యోల్బణం వల్ల, సహజంగా వచ్చే పెరుగుదల వల్ల వృద్ధిచెందుతూ ఉంటుంది. కానీ సంపద సృష్టి ఎప్పుడూ చేయని బాబుగారు, ఎప్పుడూ ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి సంపద ఆవిరిచేసే ఈ బాబుగారు, ఆ పెరుగుదల తన వల్లే అని చెప్పుకుంటూ ఉంటారు. అందుకే ఈ మోసగాడిని మాత్రమే "420" అని అంటారు.

ఈ రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం చూపుతూ అసమానతలు రూపుమాపి, అందరికీ సమాన అవకాశాలు కల్పించి, సుస్థిర అభివృద్ధి దిశగా వైయస్‌ఆర్‌సీపీ హయాంలో అనేక చర్యలు తీసుకున్నాం. విద్యారంగంలో సీబీఎస్‌ఈ, ఐబీ, పిల్లలకు ట్యాబులు, వ్యవసాయంలో ఆర్బీకే వ్యవస్థను, ఈ క్రాప్, ఫాంగేట్ వద్దే ఎంఎస్‌పీకి పంటల కొనుగోళ్లు, ఆరోగ్యరంగంలో నాడు నేడు ద్వారా ఆసుపత్రుల బలోపేతం, కొత్తగా ప్రభుత్వ రంగంలో 17 మెడికల్ కాలేజీలు, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్‌లు, ఉపాధికల్పనా రంగంలో మైక్రో సాఫ్ట్‌తో నైపుణ్యాభివృద్ధి, ఎడెక్స్ తో ఒప్పందం ద్వారా అత్యాధునిక కోర్సుల్లో శిక్షణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టాం. వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం లో అమలు చేసిన ఈ పథకాలు, కార్యక్రమాలను చంద్రబాబుగారు నీరుగారుస్తున్నారు, రద్దుచేస్తున్నారు. విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, ఉపాధి కల్పన, సుపరిపాలనలో తీసుకున్న విప్లవాత్మక సంస్కరణలు ఎన్నింటినో దెబ్బతీశారు. ప్రభుత్వంలో సృష్టించిన ఆస్తులను తన మనుషులకు అమ్మేయడానికి ప్రయత్నిస్తున్నారు. సమాజంలో కింద ఉన్నవారికి చేయూత నిచ్చి వారిలో జీవన ప్రమాణాలు పెంచి పేదరికాన్ని నిర్మూలించే దిశగా అమలుచేసిన కార్యక్రమాలన్నింటినీ తీసివేసి, పేదలను మరింత పేదవాళ్లుగా చంద్రబాబు తయారు చేస్తున్నాడు. మరి చంద్రబాబుకు విజన్ ఉందని ఎలా అనుకుంటారు అంటూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

## 2027లోనే జమిలి ఎన్నికలు

**విశాఖపట్నం:** వన్ నేషన్ వన్ ఎలక్షన్ జరుగుతుంది. 2027లోనే జమిలి ఎన్నికలు వస్తాయని, ఈ ఎన్నికలకు అందరం సిద్ధంగా ఉండాలని వైయస్‌ఆర్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్లు వస్తాయి. అసెంబ్లీ, ఎంపీ స్థానాలు పెరుగుతాయి. మూడు స్థానాల్లో ఒక స్థానం మహిళకు వస్తుంది. మహిళలకు వైయస్ జగన్ తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆయన పేర్కొన్నారు. విశాఖ నగరంలో వైయస్‌ఆర్‌సీపీ కార్యాలయాన్ని ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయ సాయిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో అంబేద్కర్, వైయస్ఆర్ విగ్రహాలకు పార్టీ నేతలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, బుడి ముత్యాల నాయుడు , ధర్మశ్రీ, వదురు కళ్యాణి, ఎంపీ తనూజ రాణి, కేకే రాజు, మళ్ళ విజయ ప్రసాద్, వాసుపల్లి గణేష్, కాయల వెంకట రెడ్డి, చెంగల వెంకట్రావు, కొండ రాజీవ్, తైనల విజయ కుమార్, చొక్కాకుల వెంకట రావు, వైయస్‌ఆర్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ విజయ సాయిరెడ్డి మాట్లాడుతూ..'ఉత్తరాంధ్రకు తిరిగి రావడం చాలా సంతోషం. గత ఎన్నికల్లో ఏ పార్టీ కార్యాలయం వేదికగా విజయం సాధించామో మళ్ళీ అదే పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం చేయడం చాలా ఆనందంగా ఉంది. ఓడిపోయామనే ఆందోళన అవసరం లేదు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అందరితో కలిసి ముందుకు సాగాలి. కార్యకర్తలకు వైయస్ జగన్ అండగా ఉంటారు. వారికి ఎలాంటి నష్టం జరగకుండా చూసుకుంటారు. నిత్యం కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉండాలి. నాకు విశాఖ నుంచి పోటీ చేసే ఆలోచన లేదు. పార్టీని గెలిపించడమే నా పని అని చెప్పారు.

**మాజీ మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ..** ఏపీలో కూటమి సర్కార్ ఏర్పడిన తర్వాత వైయస్‌ఆర్‌సీపీ నేతలను ఇబ్బంది పెడుతోందన్నారు. రాష్ట్రంలో రైతులకు మద్దతుగా వైయస్‌ఆర్‌సీపీ చేపట్టిన రైతు పోరాటానికి విశేష స్పందన లభించింది. కూటమికి దోచుకోవడమే కావాలి.. ప్రజలతో సంబంధం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా వైఎస్ జగన్ సంస్కరణలు ప్రవేశ పెట్టారు. ఆరు నెలల్లో చంద్రబాబు 72వేల కోట్లు అప్పు తెచ్చి, సంక్షేమానికి 200 కోట్లు ఖర్చు చేశారని అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయం ఎండాడలో ఉంది. నగర పార్టీ కార్యాలయం మద్దిలపాలెంలో నూతనంగా ఏర్పాటు చేశారు. నగర కార్యాలయం అందరికీ అందుబాటులో ఉంటుంది.

**ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ..** 'నూతన కార్యాలయం ప్రారంభోత్సవం చాలా సంతోషం. పార్టీ చేసే పోరాటాలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన లభించింది. 27వ తేదీన కరెంట్ చార్జీలు పెంపుపై నిరసన కార్యక్రమం ఉంది. కూటమికి ప్రజలతో సంబంధం లేదు. మీడియాను పట్టుకొని హడావుడి చేస్తోంది. వైయస్‌ఆర్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

**అరకు ఎంపీ తనూజ రాణి మాట్లాడుతూ..** అందరం కష్టపడి పని చేద్దాం. వైయస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం. కూటమి పాలనలో నిత్యవసర ధరలు, కరెంట్ ఛార్జీలు పెరిగాయి. వైయస్‌ఆర్‌సీపీ బలం కార్యకర్తలే అని చెప్పారు.

## కాకినాడ జిల్లా: రెండు కుటుంబాల మధ్య ఘర్షణ.. ముగ్గురి మృతి

**కాకినాడ జిల్లా:** సామర్లకోట మండలం వేట్లపాలెంలో దారుణం జరిగింది. ఇంటి స్థలం విషయంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు కుటుంబాల మధ్య వివాదం తలెత్తింది. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిపై మరో కుటుంబం దాడి చేసింది. ఘర్షణలో కత్తులతో దాడి చేసుకోవడంతో ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

**ఏం జరిగిందంటే? :** గ్రామంలోని ఎస్సీపేట చెరువు సమీపంలో పండు అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టారు. అదే ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు బచ్చల చక్రయ్య కుటుంబం ప్రయత్నించింది దీంతో ఇరువురి కుటుంబాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. కత్తులతో పరస్పరం దాడి చేసుకోవడంతో ప్రకాశ్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా.. చంద్రరావు, ఏసు ఆసుపత్రిలో మృతి చెందారు. తీవ్ర గాయాలైన సంజీవ్, పండు, దావీదు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## ఆప్' తుది జాబితా విడుదల

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్‌ఆద్మీపార్టీ(ఆప్) అభ్యర్థుల తుది జాబితా ఆదివారం(డిసెంబర్15) విడుదలైంది. మొత్తం 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఎన్నికలకు ఇప్పటికే ఆప్ మూడు జాబితాల్లో అభ్యర్థులను ప్రకటించింది. తాజాగా 38మంది అభ్యర్థులతో ఫైనల్ లిస్టును విడుదల చేసింది.ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనుండగా సీఎం అతిశీ మరోసారి కాల్కాజీ సీటు నుంచి బరిలో నిలుస్తున్నారు. అలాగే, గ్రేటర్ కైలాశ్ సీటు నుంచి ఆప్ కీలక నేతలు సౌరభ్ భరద్వాజ్, బాబర్‌పుర్ నుంచి గోపాల్‌రాయ్, ఓఖ్లా నుంచి అమానతుల్లా ఖాన్, షాకుర్‌బస్తీ నుంచి సత్యేందర్‌కుమార్ జైన్‌ను బరిలో దించింది.

ఈ ఎన్నికల్లో 20మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఆప్ సీట్లు నిరాకరించింది. కస్తూర్బానగర్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్న మదన్‌లాల్ స్థానంలో రమేశ్ పెహల్వాన్‌ను పోటీకి దించింది. బీజేపీని వీడిన రమేశ్ పెహల్వాన్ తన సతీమణి కుసుమ్‌లతతో కలిసి ఈ ఉదయమే ఆప్‌లో చేరారు. ఆప్ పూర్తి ఆత్మవిశ్వాసంతో 70 స్థానాల్లో అభ్యర్థుల్ని నిలబెట్టి నట్లు కేజ్రీవాల్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. 'బీజేపీ అదృశ్యమైంది. ఆ పార్టీకి సీఎం అభ్యర్థి లేరు, ఒక టీమ్‌లేదు. ప్రణాళిక లేదు. ఢిల్లీపై ఒక విజన్ లేదు. కేజ్రీవాల్‌ను తొలగించాలన్నదే వాళ్లకు ఉన్న ఏకైక మిషన్' అని విమర్శించారు.

